## దెబ్బతిన్న పంటల పరిశీలన



వాడి గ్రామంలో దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ధర్పల్లి/ సిరికొండ, మార్చి 23 : మూడు రోజుల క్రితం కురిసిన వడగండ్ల వానతో దెబ్బతిన్న పంటలను రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆదివారం పరిశీలించారు. ధర్పల్లి మండలంలోని మద్దుల్ తండా, వాడి, హోన్నాజీపేట్ శివారులో దెబ్బతిన్న వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ద్వారా సాయం అందేలా కృషిచేస్తానని హామీ ఇచ్చారు. అనంతర సిరికొండ మండలంలోని కొండూర్, చీమన్‌పల్లి, మైలారం, చిన్నవాల్గోట్ గ్రామాల్లో పంటలను పరిశీలించారు. నష్టపోయిన పంట వివరాలు అందించాలని వ్యవసాయశాఖాధికారులకు సూచించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

## బార్ అసోసియేషన్ ఎన్నికల తేదీలో మార్పు

- ఏప్రిల్ 11న ఎన్నికలు
- బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మోహన్ గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌గౌడ్

వినాయక్‌నగర్, మార్చి 23 : నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఎన్నికల అధికారుల నియామకంతోపాటు ఎన్నికల నిర్వహణ తేదీని మార్చి షెడ్యూల్ ప్రకటించినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌గౌడ్ తెలిపారు. బార్ అసోసియేషన్ హాలులో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ నరసింహారెడ్డి, వైస్‌చైర్మన్ సునీల్‌గౌడ్, సభ్యుల సమక్షంలో హైదరాబాద్‌లో ఈనెల 21న సమావేశంలో నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎగ్జిక్యూటివ్ కమిటీ ఆధ్వర్యంలో ఏప్రిల్11న ఎన్నికలు నిర్వహించాలని, ఎన్నికల అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. బార్ కౌన్సిల్, నిజామాబాద్ అసోసియేషన్ మధ్య సమాచార లోపంతో అడ్‌హక్ కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సభ్యులందరి సహకారంతో ఎన్నికలు నిర్వహిస్తామని, న్యాయవాదులందరూ ఎన్నికల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బార్ అసోసియేషన్ సభ్యులు వసంతరావు, పెండెం రాజు, దీపక్, శ్రీకాంత్, వెంకటేశ్వర్, శివాజీ బోస్లే, రవి తదితరులు పాల్గొన్నారు.

## టీయూ విద్యార్థి రాజుకు సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య పురస్కారం

డిచ్‌పల్లి, మార్చి 23 : సిద్దిపేట్‌లో వెన్నెల సాహితీ సంగమం ఆధ్వర్యంలో శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది కవి సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. టీయూ విద్యార్థి రాజు తాను రచించిన 'ఉగాది పండుగ' కవితా రచనను చదివి వినిపించారు. ముఖ్యఅతిథులు, వెన్నెల సాహితీ సంగమం సభ్యులు, రచయితులు రాజును అభినందించి, సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య పురస్కారం, ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

# పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ధర్పల్లి, మార్చి 23 : అకాలవర్షంతో పంట నష్టపోయిన రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకుడు ఆకుల పాపయ్య, జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని పలు గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను నాయకులు ఆదివారం పరిశీలించి మాట్లాడారు. చేతికందే దిశలో చివరి తడులకు నీరందక నీళ్లందక సగం పంటలు ఎండిపోయి రైతులు ఆందోళన చెందున్న సమయంలో వడగండ్ల వానలు మరింత దెబ్బతీశాయని అన్నారు. పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ. 30 వేలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సాయిరెడ్డి, దాసు, బాలయ్య, దేవస్వామి, మార్క్స్, దేవన్న, భూమేశ్, గంగాధర్, చక్రపాణి, జాకీ పాల్గొన్నారు.




ధర్పల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

## రూ.500 కోసం ఇద్దరి మధ్య ఘర్షణ

- కల్లు సీసాతో దాడి, గాయాలు

వినాయక్‌నగర్, మార్చి 23 : సైకిల్ విక్రయించిన డబ్బుల విషయంలో ఇద్దరి మధ్య జరిగిన గొడవ కల్లు సీసాతో దాడి చేసుకునేందుకు దారితీసింది. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని హబీబ్‌నగర్‌కు చెందిన మహ్మద్.. మహేశ్‌కు సైకిల్ విక్రయించాడు. ఇందుకు సంబంధించి రూ.500 బాకీని మహేశ్ చెల్లించినప్పటికీ మిర్చి కాంపౌండ్ ఏరియాలో ఉన్న కల్లు బట్టీలో ఆదివారం మళ్లీ రూ. 500 ఇవ్వాలని మహేశ్‌ను మహ్మద్ నిలదీశాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగి ఘర్షణకు దారి తీసింది. మహ్మద్ కల్లుసీసా పగులగొట్టి మహేశ్‌పై దాడి చేసేందుకు యత్నించగా.. అడ్డుకునే క్రమంలో మహేశ్ చేతికి గాయాలయ్యాయి. మహ్మద్‌కు కడుపులో గాయమైంది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

## శ్రీ విశ్వావసు నామ పంచాంగం ఆవిష్కరణ



పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

సుభాష్‌నగర్, మార్చి 23: పండుగలు భారతీయ సంస్కృతికి ప్రతిబింబాలని ప్రముఖ న్యాయవాది గిరిధర్‌రావు దేశ్‌ముఖ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ రోడ్‌లో ఉన్న గీతాభవనంలో తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ సంఘం – ఇందూరు ఆధ్వర్యంలో యల్లాప్రగడ చంద్రశేఖర్‌శర్మ రచించిన శ్రీ విశ్వావసు నామ సంవత్సర పంచాంగాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. పంచాంగ కర్తను శాలువాతో సత్కరించి అభినందించారు. సంఘం ప్రతినిధులు రొట్టె సురేశ్, పుల్కల్ రమేశ్ కులకర్ణి, అప్పాల కిష్టయ్య, పురుషోత్తమ్‌రావు కులకర్ణి, గోవింద్‌రావు దేశ్‌ముఖ్ తదితరులు పాల్గొన్నారు.

## 28న పార్లమెంట్ ఎదుట ధర్నా

కోటగిరి, మార్చి 23 : భవన కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 28న ఢిల్లీలోని పార్లమెంట్ ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు ఏఐటీయూసీ జిల్లా నాయకుడు విఠల్‌గౌడ్ తెలిపారు. మండల కేంద్రంలో ధర్నాకు సంబంధించిన గోడ ప్రతులను ఆదివారం ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలో కార్మిక సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన వివిధ బోర్డులను ఒకే గొడుగు కిందికి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు నల్ల గంగాధర్, రాజు, దత్తు, పండరి తదితరులు పాల్గొన్నారు.

## మాంసం ధరను నిర్ణయించాలి

చందూర్, మార్చి 23 : మండలకేంద్రంలో మటన్‌ను ఇష్టం వచ్చిన ధరకు విక్రయిస్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో గ్రామపెద్దలు మటన్ విక్రయాలకు ఒక నిర్ణీత ధరను నిర్ణయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## బాధితులకు ఆర్థిక సహాయం

రుద్రూర్, మార్చి 23 : మండలంలోని అంబం గ్రామంలో వారం రోజుల క్రితం అగ్నిప్రమాదంలో రెండిండ్లు పూర్తిగా కాలిపోయాయి. బాధిత కుటుంబాలకు నాయకుడు ఎలమంచలి శ్రీనివాస్ ఆదివారం ఆర్థిక సహాయం అందజేశారు. ప్రభుత్వం బాధిత కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మహేశ్, కపిల్ తదితరులు పాల్గొన్నారు.

## వాకర్స్ అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళనం

సుభాష్‌నగర్, మార్చి 23 : జిల్లా కేంద్రంలోని ఖిల్లా రఘునాథ ఆలయ ప్రాంగణంలో బ్రాహ్మణ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. నడక, వ్యాయామం, మారుతున్న జీవనశైలి తదితర అంశాలపై యోగాచార్యులు అవగాహన కల్పించారు. రోజూ ఉదయం, సాయంత్రం నడవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని, సీనియర్ సిటిజన్లు ఆరోగ్య విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని యోగా మాస్టర్ మన్మోహన్ శాస్త్రి తెలిపారు. అనంతరం ఖిల్లా రఘునాథ ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ప్రమోద్‌శర్మ, దత్తుశాస్త్రి, న్యాలం శ్రీనివాస్, మనోహర్ శాస్త్రి, వైగర్‌కర్ రాంనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## తైక్వాండో కలర్ బెల్ట్ ప్రమోషన్ టెస్ట్



విద్యార్థులతో జిల్లా జడ్జి సునీత కుంచాల, తైక్వాండో అసోసియేషన్ ప్రతినిధులు

కంఠేశ్వర్, మార్చి 23 : నగర శివారులోని మాధవ్‌నగర్‌లోని ఓ గార్డెన్‌లో అమేచూర్ తైక్వాండో అసోసియేషన్ జిల్లా ప్రధానకార్యదర్శి మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో కలర్ బెల్ట్ ప్రమోషన్ టెస్ట్‌ను ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా జడ్జి సునీత కుంచాల, పద్మావతి, తైక్వాండో చైర్మన్ బస్వా లక్ష్మీనర్సయ్య, వైస్ ప్రెసిడెంట్ నరేంద్ర గుప్తా హాజరై మాట్లాడారు. శ్రీనివాస్ సూపర్ స్పెషాలిటీ దవాఖాన వైద్యులు శ్రీనివాస్ స్పాన్సర్‌గా వ్యవహించారు. కార్యక్రమంలో బ్లాక్‌బెల్ట్ నేహా, గంగాధర్, నాగరాజు, సిద్ధార్థ రిత్విక, గోపీకృష్ణ, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయుడికి సన్మాన సభ

కోటగిరి, మార్చి 23 : పొతంగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు అశోక్ ఉద్యోగ విరమణ సందర్భంగా కోటగిరిలోని ఓ ఫంక్షన్ హాలులో ఆదివారం సన్మాన సభ ఏర్పాటు చేశారు. పొతంగల్ ఇన్‌చార్జి ఎంఈవో లోల శంకర్ హాజరై మాట్లాడారు. ఉద్యోగ విరమణ వయసుకే తప్ప సేవకు కాదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, కోటగిరి ఇన్‌చార్జి ఎంఈవో శ్రీనివాసరావు, కోటగిరి, పొతంగల్ మండలాల పీఆర్టీయూ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కోటగిరి మాజీ సర్పంచ్ పత్తి లక్ష్మణ్, విండో చైర్మన్ కూచి సిద్ధు, మాజీ ఎంపీటీసీ మనోహర్ పాల్గొన్నారు.



సన్మాన సభలో పాల్గొన్న ఉపాధ్యాయులు, నాయకులు

## భగత్‌సింగ్‌కు ఘన నివాళి



జిల్లాకేంద్రంలో నివాళులర్పిస్తున్న వామపక్ష పార్టీ నాయకులు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, మార్చి 23 : బ్రిటీష్ వారి ఆగడాలు, అరాచకాలను అడ్డుకుని భారతీయులల్లో చైతన్యం నింపి ఉరి కంభాలను చిరునవ్వుతో ముద్దాడిన భగత్‌సింగ్ వర్ధంతిని జిల్లావ్యాప్తంగా ఆదివారం నిర్వహించారు. భగత్‌సింగ్‌తో పాటు శివరాం రాజ్‌గురు, సుఖ్‌దేవ్ త్యాగాలను గుర్తుచేసుకున్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యదర్శి సుధాకర్ ఆధ్వర్యంలో నాయకులు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిరికొండ మండలంలోని సత్యశోధక్ పాఠశాలలో ప్రిన్సిపాల్ నర్సయ్య ఆధ్వర్యంలో నివాళులర్పించారు. నగరంలోని దేవీరోడ్డు చౌరస్తా, కోటగల్లీలోని భగత్‌సింగ్ విగ్రహాలకు సీపీఐ(ఎంఎల్), మాస్‌లైన్ (ప్రజాపంథా), పీడీఎస్‌యూ, పీవైఎల్, పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. డిచ్‌పల్లిలోని తెలంగాణ యూనివర్సిటీలో ఏబీవీపీ – టీయూ శాఖ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ చిత్రపటాలకు నివాళులర్పించారు. వర్ని మండల కేంద్రంలో సీపీఎం నాయకుడు నెల్లూరి లక్ష్మణ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి నిర్వహించారు. మోర్తాడ్ మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో ఆదివారం సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతిని నిర్వహించారు. నవీపేట మండల కేంద్రంలో జన వికాస సేవ సంస్థ జిల్లా అధ్యక్షుడు తెడ్డు పోశెట్టి ఆధ్వర్యంలో భగత్ సింగ్ వర్ధంతి నిర్వహించారు. ఆర్మూర్ పట్టణం మామిడిపల్లిలో భగత్ సింగ్ విగ్రహానికి పీడీఎస్‌యూ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## ఎన్నాళ్లకెన్నాళ్లకు..



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న వేల్పూర్ జడ్పీహెచ్‌ఎస్ 1976-77 బ్యాచ్ విద్యార్థులు

వేల్పూర్, మార్చి 23 : వారంతా చిన్ననాటి స్నేహితులు, 1వ తరగతి నుంచి పదో తరగతి వరకు కలిసి చదువుకున్నారు. వేల్పూర్ జడ్పీహెచ్‌ఎస్‌లో 1976–77 బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థులు 49 ఏండ్ల తర్వాత మళ్లీ వారు చదువుకున్న పాఠశాలలో కలుసుకున్నారు. వివిధ రంగాల్లో ఉద్యోగులుగా, రాజకీయాల్లో ఎక్కడెక్కడో స్థిరపడిన వారు ఒక్కచోట చేరి వారి అనుభవాలను పంచుకున్నారు. చాలా ఏండ్ల తర్వాత స్నేహితులను కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు. అప్పటి గురువులను జ్ఞాపకం చేసుకున్నారు. అప్పటికొందరు స్నేహితులు, ఉపాధ్యాయులు గతంలో మృతి చెందగా వారికి శ్రద్ధాంజలి ఘటించారు.



కార్యక్రమంలో పాల్గొన్న కొత్తపల్లి పాఠశాల 1989-90 బ్యాచ్ విద్యార్థులు

### కొత్తపల్లిలో 1989-1990 బ్యాచ్ విద్యార్థులు

కంఠేశ్వర్, మార్చి 23 : మాక్లూర్ మండలంలోని కొత్తపల్లి జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన 1989–1990 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని పద్మావతి కల్యాణ మండపంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్ననాటి మిత్రులతో పాత జ్ఞాపకాలను నెమరేసుకొని రోజంతా సంతోషంగా గడిపారు.

## లింబాద్రిగుట్టపై ఎన్నికల కమిషన్ సెక్రటరీ పూజలు



లింబాద్రిగుట్టపై ఎన్నికల కమిషన్ సెక్రటరీ

మోర్తాడ్, మార్చి 23: దక్షిణ బద్రినాథ్‌గా పూజలందుకుంటున్న లింబాద్రిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారిని ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ సెక్రటరీ అశోక్‌కుమార్, కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ వేదపండితుడు నంబీపార్థసారథి, విజయసారథి మర్యాదపూర్వకంగా స్వాగతించారు. ఆయన వెంట ఆలయ అర్చకులు నంబీవాసుదేవచార్యులు, వేల్పూర్ వాసు, నంబీ శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

## మిత్రుడి కుటుంబానికి రూ.లక్ష సాయం

ఆర్మూర్‌టౌన్, మార్చి23: పట్టణంలోని జిల్లా పరిషత్ రాంమందిర్ ఉన్నత పాఠశాల 2006–07 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం తన మిత్రుడి కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. పట్టణానికి చెందిన పూర్వ విద్యార్థి అశోక్ ఇటీవల మృతి చెందాడు. దీంతో పూర్వ విద్యార్థులంతా బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. మృతుడి కుమార్తె పేరిట రూ.లక్ష డిపాజిట్ చేసి, బాండ్ పేపర్‌ను అందజేశారు. ఆపదలో అండగా నిలిచిన మిత్రులను పలువురు అభినందించారు.

## సీసీ రోడ్డు పనులకు భూమిపూజ

మాక్లూర్, మార్చి23: మండలంలోని మాదాపూర్‌లోని శ్మశాన వాటికకు వెళ్లే సీసీ సీసీ రోడ్డు పనులకు బీజేపీ మండల అధ్యక్షురాలు మదారి మమత ఆదివారం భూమిపూజ చేశారు. ఈ పనులకు ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి రూ. ఐదు లక్షలు మంజూరు చేసినట్లు ఆమె పేర్కొన్నారు.కార్యక్రమంలో మదారి రాజేశ్వర్, భూమయ్య, ఈజీఎస్ ఎఫ్‌ఏ మాధవి పాల్గొన్నారు.

## గిరిజన యూనివర్సిటీ వీసీ శ్రీనివాస్‌కు సన్మానం



వీసీ శ్రీనివాస్ దంపతులను సన్మానిస్తున్న ట్రస్మా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

బోధన్, మార్చి 23: రాష్ట్రంలో ఏర్పాటుచేసిన సమ్మక్క సారలక్క గిరిజన యూనివర్సిటీ తొలి వైస్ ఛాన్స్‌లర్‌గా ఇటీవల నియమితులైన ప్రొఫెసర్ వైఎల్ శ్రీనివాస్ తన నియామకం అనంతరం మొదటిసారి ఆదివారం తన స్వస్థలం బోధన్ పట్టణానికి వచ్చారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు పట్టణంలోని ఆయన స్వగృహానికి వెళ్లి కలిశారు. వైఎల్ శ్రీనివాస్, ఆయన సతీమణి పద్మను తెలంగాణ రాష్ట్ర స్కూల్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (ట్రస్మా) జిల్లా అధ్యక్షుడు, ఇందూర్ హైస్కూల్ కరస్పాండెంట్ కొడాలి కిశోర్ సన్మానించారు. కార్యక్రమంలో ప్రభుత్వ మధుమలంచ డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ వై.శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ గౌసుద్దీన్, మాజీ ఎంపీపీ గంగాశంకర్, సాలూర తహసీల్దార్ శశిభూషణ్, డిప్యూటీ తహసీల్దార్ మమత, కొడాలి లావణ్య లక్ష్మి, స్వాతి, అంజలి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన వ్యాను

బోధన్ రూరల్, మార్చి23: సాలూర శివారులో ఆదివారం సాలూర బైపాస్ రోడ్డు వద్ద హైటెన్షన్ విద్యుత్ స్తంభాన్ని డీసీఎం వ్యాన్ ఢీకొట్టింది. బోధన్ నుంచి మహారాష్ట్ర వైపు వెళ్తుండగా డీసీఎం అదుపుతప్పడంతో ఈ ప్రమాదం చోటుచేసుకున్నది. ప్రమాదంలో డీసీఎం డ్రైవర్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు 108 అంబులెన్స్‌లో దవాఖానకు తరలించారు. బోధన్–సాలూర రహదారిపై సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

## వైద్యశిబిరం..

మోర్తాడ్, మార్చి23: కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఆర్మూర్‌లైఫ్ దవాఖాన, ధన్వంతరి విజయయాత్ర–2లో భాగంగా వైద్యశిబిరాన్ని నిర్వహించింది. ఉప్లూర్‌తో పాటు, ఆర్అర్‌నగర్, దమ్మన్నపేట్ ప్రజలు వచ్చి వైద్యపరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్లు భాను, శ్రీకాంత్, స్రవంతి రెడ్డి వైద్యసేవలు అందించారు. ఈశిబిరానికి సొసైటీ చైర్మన్ రేగుంట దేవేందర్, మురళి, చిన్నారెడ్డి, దయానంద్, లక్ష్మణ్ తదితరులు సహకరించారు.

# పన్ను బకాయి చెల్లించని షటర్లు సీజ్

- బోధన్‌లో పన్ను వసూళ్లకు ప్రత్యేక చర్యలు



షటర్‌కు తాళం వేస్తున్న మున్సిపల్ అధికారులు

బోధన్, మార్చి 23: పట్టణంలో పన్ను వసూళ్లకు మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది బృందాలుగా ఏర్పడి పన్నులు వసూలు చేస్తున్నారు. పెద్ద మొత్తంలో బకాయి పడిన, మొండి బకాయిదారులకు చెందిన షటర్లకు తాళాలు వేస్తూ సీజ్ చేస్తున్నారు. ఆదివారం కెకె సూపర్ మార్కెట్ నుంచి రూ.3,16,629 పన్ను రావాల్సి ఉండగా యజమాని చెల్లించడం లేదు. దీంతో అధికారులు షటర్లకు తాళాలు వేశారు. అనీల్ టాకీస్ ప్రాంతంలోని పలు మడిగెలకు తాళాలు వేసి సీజ్‌చేశారు. సంబంధిత ఉన్నతాధికారులతో పాటు ఇటీవల బోధన్ మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించిన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి కూడా పన్ను వసూల్లు వందశాతం చేయించాలని, మొండి బకాయిల వసూలుకు అవసరమైతే పోలీసు శాఖ సహకారం తీసుకోవాలని సూచించారు. ఈ నెలాఖరులోగా వందశాతం పన్నులు వసూలు చేసేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఆదివారం సెలవుదినం అయినా ఇంటింటికీ తిరుగుతూ అధికారులు పన్ను వసూలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్ల వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నవీపేట, మార్చి 23: ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి ఆదుకోవాలని ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు కటారి రాములు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో చలో పార్లమెంట్ పోస్టర్లను ఆవిష్కరించారు. యూనియన్ అధ్యక్షుడు మాట్లాడుతూ ప్రైవేటు ఫైనాన్స్‌ల వేధింపులు భరించలేక కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఆటోలు నడవక ఆర్థిక ఇబ్బందులు ఎక్కువయ్యాయని అన్నారు. ఎన్నికాల్లో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు రూ. 12 వేలు ఇవ్వాలని, కార్మికులకు రూ. 4,000 పింఛన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాయక్‌వాడ్ శ్రీనివాస్, మండల అధ్యక్షుడు అంజనేయులు, నవీపేట మండల ఆటో యూనియన్ అధ్యక్షుడు కబీర్‌ఖాన్, రాజారాం, అర్జున్, తదితరులు ఉన్నారు.

## ఇసుక, మొరం ట్రాక్టర్ల పట్టివేత

మాక్లూర్, మార్చి23: మండలంలోని చిక్లీ గ్రామ శివారులో అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్న ట్రాక్టర్‌ను, బోర్గాం(కె) గ్రామ శివారులోని పులాంగ్ వాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం పట్టుకున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై లక్ష్మయ్య తెలిపారు. వాటిని పోలీస్ స్టేషన్‌కు తరలించి యజమానులపై కేసులు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు. అక్రమంగా ఇసుక, మొరం తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


## రెండు ఇసుక టిప్పర్లు పట్టివేత

బోధన్ రూరల్, మార్చి 23: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు బోధన్ రూరల్ ఎస్సై మశ్చేందర్‌రెడ్డి తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. సాలూర మండలం హున్సా, మందర్న శివారులో మంజీరా నదీ నుంచి ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఎవరైనా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## చెరువులో పడి ఒకరి మృతి

బోధన్ రూరల్, మార్చి 23: సాలూర మండలంలోని జాడిజమాల్‌పూర్ గ్రామంలో చెరువులో పడి ఒకరు మృతి చెందారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మోతేవార్ రమేశ్ (26) పొలం పనులు ముగించుకొని తిరిగి ఇంటి వస్తుండగా కాలకృత్యాలు తీర్చుకునేందుకు చెరువులో దిగాడు. ప్రమాదవషత్తు కాలు జారి నీటిలో పడి మృతిచెందాడు. మృతుడి తండ్రి నాగ్‌నాథ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అబుదాబిలో తొర్తి వాసి మృతి



గంగాధర్ (ఫైల్)

ఏర్గట్ల, మార్చి 23: అబుదాబిలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని తొర్తి గ్రామానికి చెందిన ఈర్గాల గంగాధర్(43) అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. గంగాధర్ గ్రామంలో కల్లు గీస్తూ గీతకార్మికుడిగా జీవనం సాగించేవాడు. బతుకుదెరువు కోసం గతేడాది అబుదాబికి వెళ్లి డెలివరీ బాయ్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. రోజు లాగే ద్విచక్రవాహనంపై డెలివరీ చేసేందుకు శనివారం వెళ్లాడు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాదం నెలకొంది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## మట్కాస్థావరంపై దాడి...కేసు నమోదు

ఆర్మూర్‌టౌన్, మార్చి23: పట్టణంలోని జెండా గల్లీలో ఓ ఇంట్లో మట్కా ఆడుతున్న ముగ్గురిని పట్టుకున్నట్లు పట్టణ సీఐ సత్యనారాయణ గౌడ్ తెలిపారు. వారి నుంచి మూడు సెల్ ఫోన్లు, రూ.14 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎవరైనా మట్కా ఆడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## రేపు సాటాపూర్ సంత వేలం

రెంజల్, మార్చి 23: సాటాపూర్ జీపీ ఆవరణలో మంగళవారం ఉదయం 10 గంటలకు వార సంతవేలం నిర్వహించనున్నట్లు గ్రామ కార్యదర్శి మహిబూబ్‌అలీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వారంతపు సంత 2025–26 సంవత్సరానికి గాను తైబజారు, దడువాయి వేలం పాటలో పాల్గొనే వారు డిపాజిట్‌ను ముందుగా చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు. 2025 ఏప్రిల్ 1 నుంచి 2026 మార్చి వరకు కాల పరిమితి ఉంటుందని గ్రామ కార్యదర్శి పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

పాస్‌పోర్ట్ పోయినది
★ నేను కుమ్మరి రవికుమార్ తండ్రి సంగయ్య, ని|| ఇ.నెం.9-31/1 గ్రా|| & మం|| గాంధారి, జి|| కామారెడ్డి నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్ట్ నెం. U9808130 గలది కామారెడ్డి నుండి గాంధారికి బస్సులో వస్తున్నప్పుడు నా బ్యాగ్ పోయినది. దయచేసి ఎవరికైన దొరికినచో సంప్రదించు నెం.8464892289, 6281218070
NTZ-338419

WANTED
★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-330667-AII

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## పద్మశాలీ సంఘాల కార్యవర్గాల ఎన్నిక

మోర్తాడ్, మార్చి23: కమ్మర్‌పల్లి, ఉప్లూర్ గ్రామాల్లో ఆదివారం పద్మశాలీ సంఘాల నూతన కార్యవర్గాలను ఆదివారం ఎన్నుకున్నారు. కమ్మర్‌పల్లి పద్మశాలీ విజయ సంఘం అధ్యక్షుడిగా చింత హన్మంతు, ఉపాధ్యక్షుడిగా చింత సత్యనారాయణ, కార్యదర్శిగా బొడ్డు శంకర్, కోశాధికారిగా చింత హన్మంతు, దైవశెట్టిలుగా పోతు అర్జున్, చిలివేరి దేవేందర్ ఎన్నికయ్యారు. ఉప్లూర్ గ్రామ పద్మశాలీ సంఘం అధ్యక్షుడిగా జిందం రమేశ్, ఉపాధ్యక్షుడిగా శైలేందర్, కార్యదర్శిగా జిందం మల్లేశ్వర్, దైవశెట్టిగా అంగరి రమేశ్, కార్యవర్గ సభ్యులుగా యెనుగందుల శశిధర్, హన్మాండ్లు ఎన్నికయ్యారు.

## విశ్వబ్రాహ్మణ సంఘం కార్యవర్గం

మోర్తాడ్, మార్చి23: భీమ్‌గల్ పట్టణంలో ఆదివారం విశ్వబ్రాహ్మణ మను, మయ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాగి రఘు, ప్రధాన కార్యదర్శిగా నిచ్చమొల్ల మనోజ్, కోశాధికారిగా దడివి శ్రీనివాస్, పెళ్లిపెద్దలుగా దేవాయి రాజశేఖర్, రాగిరవి, నిచ్చమొల్ల నవీన్, రాగి గంగనారాయణ, దడివి లింగంను ఎన్నుకున్నారు.

## రోడ్డు పైనే వాహనాల పార్కింగ్



ఆర్మూర్‌లో రోడ్డు పైనే పార్కింగ్

ఆర్మూర్‌టౌన్, మార్చి23: పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ తీవ్రం అవుతోంది. పెరుగుతున్న జనాభా, వాహనాల సంఖ్యకు అనుగుణంగా రోడ్ల విస్తరణ చేపట్టకపోవడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. రోడ్లకు ఇరువైపులా వాహనాలను పార్క్ చేస్తుండడంతో వచ్చిపోయే వాహనాలకు ఇబ్బందిగా మారింది. ముఖ్యంగా వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద, మామిడిపల్లి చౌరస్తా, అంబేద్కర్ చౌరస్తా, పాత బస్టాండ్ తదితర ప్రాంతాల్లో హోటళ్లు, వ్యాపార, వాణిజ్య దుకాణాలు అధికంగా ఉన్నాయి. వీటికి సెల్లార్ సౌకర్యం లేకపోవడంతో వాహనాలు రోడ్ల పైనే నిలుపుతున్నారు. కొత్త బస్టాండ్ వద్ద ఓ హోటల్ ఎదుట రోడ్డు పైనే వాహనాలను పార్క్ చేస్తున్నారు. వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## సనాతన ధర్మం గొప్పది

మాక్లూర్, మార్చి23: మండలంలోని దుర్గానగర్ గ్రామంలో వశిష్ట పరంపర ఆధ్యాత్మిక ట్రస్ట్ గోకులాశ్రమం వెల్కటూర్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు సనాత ధర్మం విశిష్టతపై గ్రామస్తులకు సద్గురు మధుసూదనార్యులు, సద్గురు మాతా సరళాదేవి ప్రవచనాలను అందజేశారు. యోగం ద్వారానే ముక్తి లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో జీవించాలని సూచించారు.

## దుండగులను కఠినంగా శిక్షించాలి

మోర్తాడ్, మార్చి 23: తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం దుబ్బచర్ల గ్రామం గాంధీకాలనీలో అంబేద్కర్ విగ్రహానికి చెప్పులదండ వేసి అవమానించిన దుండగులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని మోర్తాడ్ మండల దళిత సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజారాం డిమాండ్ చేశారు. ఆదివారం మోర్తాడ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో జాంభవ, గంగాధర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.